# కొత్త ప్రపంచం

ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలప్పుడు మా ఇంటి ముందు ఓ పడవ లాంటి కారు ఆగింది. అందులోంచి దిగిన ఇద్దరు యువకులు నాకు నమస్కరించి "మా ఊళ్ళో మీకు గొప్ప సాహితీ సన్మానం ఏర్పాటుచేశాం సార్! మీరు వెంటనే బయలుదేరండి" అనే సరికి నేను సంతోషంతో పొంగిపోయాను. అరగంటలో తయారై వాళ్ళు వచ్చిన ఏ.సి. కారులో కూర్చున్నాను.

కారు బయలుదేరింది. ముందు సీట్లో డ్రైవరు ప్రక్కన ఆ ఇద్దరు యువకులూ కూర్చుంటే, విశాలమైన వెనక సీట్లో జారగిలబడి కూర్చున్నాను. ఏ.సి. చల్లదనానికి వేగంగా సాగిపోతున్న కారు యొక్క మెత్తని కుదుపులకు నాకు తెలియకుండానే నిద్రలోకి జారిపోయాను.

నేను మెలకువ వచ్చి చూసేసరికి అప్పుడే ఉదయపు చీకట్లు విడిపోతున్నాయి. కాని కారు అదే వేగంతో ముందుకు పోతూ వుంది. అంటే రాత్రి తెల్లవార్లూ నేను ప్రయాణం చేస్తూనే ఉన్నానన్నమాట. నిన్న సాయంత్రం చేస్తారనుకున్న సన్మానం ఈ రోజు సాయంత్రం చేస్తారన్నమాట. ఇప్పుడు ముందు సీట్లోని ఇద్దరు యువకులూ నిద్రపోతున్నారు.

కొద్ది సేపటికి కారు అందమైన ఒక పెద్ద నగరంలో ప్రవేశించింది. ఆ నగరం నేను ఎప్పుడూ చూళ్ళేదు. నేమ్ బోర్డుల కోసం వీధుల్లో వెతికాను. ఎక్కడా కనిపించలేదు. కారువెళ్ళి ఓ పెద్ద బంగళా ముందు ఆగింది. ఇద్దరు యువకులూ మేలుకొన్నారు. డ్రైవరు కారుదిగి వచ్చి గౌరవ సూచకంగా డోరు తీసి పట్టుకున్నాడు. నేను దిగీ దిగగానే "రచయిత కోటిలింగం గారికి జిందాబాద్" అంటూ పెద్ద పెద్ద దండలు నా మెడలో వేశారు, అక్కడ గుమికూడి వున్న పెద్దలు.

నేను తమ నగరానికి రావడం వాళ్ళకెంతో ఆనందం కలిగించిందని చెప్పారు. వాళ్ళల్లో ఒక యువకుడు "చూడండి మహానుభావా! మీరు మా అతిథులు. కొన్ని రోజులు పాటు మీరీ గెస్ట్‌హౌస్‌లో వుండాలి. ఇక్కడ మీకేమీ కొరత రాదు. నౌకర్లు, కారు అన్నీ తమ ఆధీనంలో వుంటాయి" అంటూ లోపలికి తీసుకెళ్ళి ఇల్లంతా తిప్పి చూపాడు. నౌకర్లు అంతా వంగి వంగి దణ్ణాలు పెట్టారు. నాకు కొత్త ప్రపంచంలో అడుగు పెట్టినట్లుగా వుంది.

నన్ను చివరగా ఒక అద్దాల గదిలోకి తీసుకువెళ్ళి "ఇది మీ ఆఫీసురూము. ఈమె మీ పర్సనల్ సెక్రటరీ ప్రభావతి. మీ విషయాలన్నీ చూస్తుంది" అంటూ మోకాళ్ళపైకి పొట్టి గౌనులో బాబ్డ్ హెయిర్‌తో నిలబడి వున్న ఓ ఇరవై యేళ్ళ అమ్మాయిని చూపించాడు.

ఆ అమ్మాయి తెల్లగా, అందంగా, బొద్దుగా, ముద్దుముద్దుగా వుంది. దొండపండు లాంటి ఎర్రని పెదాలు తడితో మెరుస్తుండగా వాటిని మెల్లగా విడదీసి విశాలమైన నల్లని కాటుక కన్నులతో నా వైపు వింతగా చూస్తూ "గుడ్‌మార్నింగ్ సర్" అంది.

నేను మిడిగుడ్లు వేసుకుని చూస్తున్నవాడ్నల్లా ఈ లోకంలోకి వచ్చి "యస్.... యస్... మార్నింగ్" అంటూ జవాబిచ్చాను.

వచ్చినతను వెళ్ళిపోయాడు. ఇక నా బాధ్యతలన్నీ నా సెక్రటరీ ప్రభావతి తీసుకుంది. నౌకర్లను పురమాయించి నాకు అన్ని ఏర్పాట్లు చేసింది. నేను బాత్ రూమ్‌లోకి వెళ్ళి స్నానం చేసివచ్చేసరికి డైనింగు హాల్లో టిఫిన్ రెడీ చేసింది.

టిఫిన్ అయిన తరువాత బెడ్‌రూమ్‌కు వెళ్ళి కొద్దిసేపు పడుకున్నాను. నేను లేచేసరికి పన్నెండు అయింది. గది వాకిట్లో చిరునవ్వుతో నిలబడి వుంది ప్రభావతి. మళ్ళీ ముఖం కడుక్కుని డైనింగ్ హాల్లోకి వెళ్ళేసరికి వేడివేడి పదార్థాలు వడ్డించింది వంటమనిషి అనసూయ. తృప్తిగా తిన్నాను. కొదిసేపు రెస్ట్‌రూమ్‌లో విశ్రాంతి తీసుకున్నాను. నాకెదుగా నా సెక్రటరీ ప్రభావతి కూర్చుని కొద్దిసేపు కబుర్లు చెప్పింది. ఆ మహానగరాన్ని గురించి, అక్కడి వింత, విశేషాల గురించి చాలాసేపు చెప్పింది. ఆమె మధురమైన మాటలు వింటూ చాలాసేపు మైమరచిపోయాను.

"మీరు విశ్రాంతి తీసుకోండి. సాయంత్రం ఐదు గంటలకు రెడీ అయి వుండండి. మనం సిటీలోకి వెళ్దాం" అంటూ వీడ్కోలు తీసుకొని ఆఫీసురూమ్ వైపు వెళ్ళిపోయింది.

'నా సన్మానం సంగతి...' అనబోయి తమాయించుకున్నాను అది సభ్యత కాదని.

నేను నా గదికి వెళ్ళి నాలుగు గంటల వరకూ నిద్రపోయాను. నాలుగు గంటలకు లేచి స్నానం, గట్రా పూర్తిచేసి ఐదు గంటలకల్లా డ్రెస్ చేసుకొని రెడీగా ఉన్నాను.

"గుడ్ ఈవెనింగ్ సర్" అంటూ వచ్చి విష్ చేసింది ప్రభావతి. ఇప్పుడు డీసెంటుగా చీర కట్టుకొని ఎంతో అందంగా వుంది.

తరువాత మేము బయటికి వచ్చేసరికి ఆ రోజు ఉదయం నేను వచ్చిన కారు మా కోసం రెడీగా వుంది. డ్రైవరు విష్‌చేసి కారు డోరు తీశాడు. నేను లోపలికి వెళ్ళి వెనుక సీట్లో కూర్చున్నాను.

ప్రభావతి వచ్చి నా ప్రక్కనే కూర్చుంది. ఆమె శరీరం మీది నుంచి వచ్చే సెంటు వాసనలు ఘుమాళిస్తున్నాయి. ఇద్దరం ఆ సాయంత్రం చాలా ఆనందంగా గడిపాము. ఆ నగరంలో ప్రసిద్ధిచెందిన ఫ్లవర్ గార్డెన్ చూపించింది. అక్కడ నన్ను చాలా మంది విష్ చేసి పలకరించారు. తరువాత సీషోర్‌కి వెళ్ళాము. అక్కడ సముద్రపు చల్లని గాలిని పీలుస్తూ ఇద్దరమూ చాలా దూరం నడిచాము. ప్రభావతి తన చీరను ముంగాళ్ళపైకి ఎత్తిపట్టి సముద్రపు అలల నురగ మీద తన తెల్లని పాదాలు మోపుతూ నడుస్తోంది.

"నమస్తే సార్"

"ఎన్నాళ్ళకు చూశాము సార్?"

ఇలా మాకెదురొచ్చిన ప్రతి ఒక్కరూ నన్ను పలుకరిస్తున్నారు. నేను ఎంతో ఆశ్చర్యపోయాను. నేను పేరున్న రచయితనే. అయితే ఎప్పుడూ నా ఫోటో పత్రికలలో పడలేదు. అయితే వీళ్ళందరికీ నేనెలా తెలుసు? ఇదే విషయం సెక్రటరీ ప్రభావతిని అడిగాను.

"మీరు ఈ ఊరికి కొత్త కదా సార్! అందులోనూ పెద్దవాళ్ళు. అందుకని పలుకరించి వుంటారు" అని అంతలోనే ఆందోళనగా "సార్ పొరపాటున కూడా మీరు ఈ నగరంలో ఒంటరిగా తిరగకండి. చాలా ప్రమాదం" అంటూ నన్ను హెచ్చరించింది.

ఆమె సమాధానం నాకేమాత్రం తృప్తికరంగాలేదు. నా పేరు ప్రతిష్ఠలు భరించలేక ఈర్ష్యతో అలా చెబుతుందను కున్నాను. అప్పటికి మౌనంగా వున్నాను.

మేము ఆ రాత్రి ఇంటికొచ్చేసరికి ఎనిమిదయింది. నేను స్నానం చేసి భోంచేసేసరికి తొమ్మిది అయింది. గదికి వెళ్ళి డబుల్‌కాట్ బెడ్ మీద వున్న రెండు పిల్లోలను ఒకదానిమీద ఒకటి వేసి దానికి ఆనుకుని కూర్చుని జరిగిన విషయాలన్నీ ఆలోచిస్తున్నాను.

కాని ఎంత ఆలోచించినా ఈ నగరం మిస్టరీ అర్థం కావడంలేదు. నగరమంతా చిరపరిచితంగా వుంది. దానికి తగ్గట్లు కనిపించిన ప్రతి వ్యక్తీ పలుకరిస్తూనే ఉన్నాడు. ఈ మిస్టరీ ఛేదించాలంటే నేను ఒంటరిగా వెళ్ళాలి. నన్ను పలుకరించిన ప్రతివాడితోనూ మాట్లాడాలి. అప్పుడుగానీ ఈ మిస్టరీ ఛేదింపబడదు అనుకున్నాను.

• • • • • • • • •

ఉదయం బద్ధకంగా నిద్ర లేచాను అప్పటికే ప్రభావతి వెళ్ళిపోయింది. నేను స్నానం చేసి వచ్చేసరికి ఫ్రెష్‌గా అప్పుడే వికసించిన గులాబీలా తయారైన ప్రభావతి నన్ను విష్ చేసింది. చిరునవ్వుతో డైనింగ్ టేబుల్ దగ్గరకు ఆహ్వానించింది.

టిఫిన్ అయిన తరువాత తిరిగి నా గదిలోకి వెళ్ళి కూర్చున్నాను. తినడం, పడుకోవడం, తిరగడం... ఇలా నాలుగు రోజులు గడిచాయి. నాకేం అంతుపట్టడంలేదు. సన్మానం సంగతి అటుంచి, సన్మానం చేస్తామని తీసుకొచ్చినవాళ్ళు కూడా అంతులేరు. ఒంటరిగా బయటికి వెళ్దామంటే వీలు కావడంలేదు.

ఆ రోజు నాకు మంచి అవకాశం దొరికింది. నౌకర్లు ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. నా పర్సనల్ సెక్రటరీ ప్రభావతి ఆఫీసు రూమ్‌లో, ఏదో టైప్ చేసుకుంటూ వుంది. ఇదే సమయమనుకున్నాను. మెల్లగా అడుగులు వేస్తు బయటికి వచ్చాను.

గూర్ఖా కూర్చునే కళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తున్నాడు. సగం తెరిచిన గేటులోంచి మెల్లగా బయటపడ్డాను.

నేను మెల్లగా వీధిలోకి నడిచాను. రోడ్లన్నీ నాకు తెలిసిన ప్రదేశాల్లా ఉన్నాయి. నగరంలోని ప్రతి అంగుళమూ నాకు బాగా తెలిసినట్లు చిరపరిచితంగా ఉంది. దూరంగా రోడ్డు ప్రక్కన కుడివైపున రమణ కాఫీ హోటల్ కనిపిస్తూవుంది. మెల్లిగా ఆ హోటల్‌లో దూరాను. ప్రొప్రయిటర్ నా వైపు చూసి చిరునవ్వుతో "వణక్కం సార్" అన్నాడు.

'అరె... ఇతను త్రిలింగం... ఇక్కడెందుకున్నాడు?' అనుకున్నాను. అయితే ఇతనెక్కడ నాకు పరిచయమయ్యాడు? ఎంత ఆలోచించినా నాకు అర్థం కావడంలేదు. రచయితలకు మతిమరుపంటారు. అయినా నాకు మరీ ఇంత మతిమరుపా?

నేను ఒక టేబుల్ ముందు కూర్చున్నాను. రెండిడ్లీ, ఒక వడ, కొబ్బరి చెట్నీతో సర్వర్ చక్రం నా ముందు టిఫిను ప్లేటు పెట్టి "మసాలా దోశె ఆల్రెడీ చెప్పేశాను సార్" అన్నాడు నా వైపు చిరునవ్వుతో చూస్తూ.

అరె... నేను టిఫినుకు ఆర్డరివ్వక ముందే నేను సాధారణంగా తినే టిఫిన్ తెచ్చిపెట్టాడు. అదీగాక నేను ఇడ్లీ వడ తరువాత ఖచ్చితంగా మసాలా దోసె తింటాను. హైదరాబాద్‌లో నేను వాడుకగా వెళ్ళే హోటల్‌లో నేను అర్డరివ్వకముందే సర్వర్లు టిఫిన్ నా టేబుల్‌మీద పెట్టేస్తుంటారు. అలాంటిది వీడు ఈ చక్రంగాడు అన్నీ తెలిసినట్లే పెట్టాడు.

అసలు ఈ చక్రం సర్వరుగా నాకు తెలుసుగానీ, వీడెక్కడ పని చేస్తూ ఉండేవాడో నాకు గుర్తొచ్చి చావడంలేదు. హైదరాబాదులో మాత్రం కాదని ఖచ్చితంగా చెప్పగలను.

టిఫిన్ తింటుంటే చాలామంది నన్ను పలకరించారు. "హలో కోటిలిగం గారూ! బాగున్నారా?" అని కొంతమంది, "ఎప్పుడొచ్చారీ ఊరికి?" అని మరికొంతమంది పరామర్శించారు.

అందరూ నాకు చిరపరిచితులే. అందరి పేర్లూ గుర్తున్నాయి. కాని వాళ్ళు ఎవరు? ఎలా పరిచయమయ్యారన్నదే అర్థం కావడం లేదు. టిఫిన్ పూర్తిచేసి మళ్ళీ రోడ్డు మీదికి వచ్చాను.

అరె... ఈ ఊళ్ళో బ్రిడ్డి అవతల నెహ్రూమ్యూజియం వుండాలి గదూ! నాలో నేను అనుకున్నాను. అది ఇక్కడికి రెండు మైళ్ళ దూరంలో వుంది. నడవగలనా అని అనుకుంటుండగానే రిక్షా వచ్చి నాముందు ఆగింది.

రిక్షావాలాను పరీక్షగా చూశాను. సన్నగా ఎండిపోయి ఉన్నాడు. పొట్ట వెన్నుకు అంటుకుపోయి వుంది. చిన్నపిల్లలు చూస్తే పిశాచమనుకుని, జ్వరాన పడేట్లు వున్నాడు. వీడు... వీడు... పోతురాజు... ముమ్మాటికీ పోతురాజే....

"నువ్వు పోతురాజువి కదూ"

"అవును సామే! నా పెళ్ళాం పేరు ఎంగిటి. నాలుగిళ్ళలో పాసిపన్లు చేసుద్ది. తమరింకా గుర్తు పెట్టుకున్నారా సామే" అన్నాడు పోతురాజు కళ్ళు తుడుచుకుంటూ. రాయలసీమ బావుల్లా ఎండిపోయిన కళ్ళల్లో నీరెక్కడది?

"ఎక్కండి సామే" అన్నాడు పోతురాజు.

"నీకు టి.బి. కదట్రా! నువ్వు తొక్కగలవా?"

"ఆ... దాందేముంది సామే. మాలాంటోళ్ళకి జబ్బులొక పక్క వస్తానే ఉంటాయి. మరోపక్క పనిజేస్తానే ఉంటాం. లేకపోతే కూడెట్టా సామే...." అన్నాడు వేదాంత ధోరణిలో.

నేను రిక్షాలో కూర్చున్న తరువాత రిక్షాలాగుతూ తన సొదంతా వెళ్ళబోసుకున్నాడు. తనకు టి.బి. తగ్గలేదట. తన భార్య కడుపు నొప్పితో బాధపడుతుందట.

"నీ మొదటి పెళ్ళాం లక్ష్మిగనుక ఉండుంటే. నీకు ఇన్ని బాధలుండకపోనురా" అన్నాను ఓదారుస్తూ.

"అవును సామే! ఆ ఆటో డ్రైవర్ నా కొడుకు దాన్ని మాయజేసి తీసుకెళ్లకుంటే నా బ్రతుకిట్లా ఉండేది కాదు" అంటూ విచారపడ్డాడు.

నేను మ్యూజియం దగ్గర దిగి వాడికి పది రూపాయలు రిక్షా బాడుగ ఇవ్వబోతే వాడు తీసుకోలేదు. బలవంతంమీద వాడి చేతిలో పెట్టాను.

మ్యూజియంలోకి వెళ్ళాను. అక్కడ కూడా చాలా మంది పలుకరించారు. అక్కడి నుంచి గాంధీ పార్కుకి వచ్చి చల్లని నీడన సిమెంటు బెంచీమీద కూర్చున్నాను.

ఇంతలో బఠాణీలు అమ్ముతూ వచ్చాడు రంగడు.

"ఏరా రంగా! బావున్నావా?" అడిగాను.

"ఎవురో అనుకున్నాను. తమరా సామే! ఏదో ఇట్టా ఉన్నా. ఎదుగూ బొదుగూ లేని ఎదవ బ్రతుకు బ్రతుకుతున్నా" అన్నాడు, నాకెదురుగా క్రింద చతికిలబడి కూర్చుంటూ.

వాడి కొంపలో సంగతులు ఏవేవో చెప్పుకొచ్చాడు. వాడి పెళ్ళాంవాడి మాట వినదట. వాళ్ళ అమ్మ ఎంత చెబితే అంతేనట. ఇదంతా తాను ఇల్లరికం పోవడం వల్లనే జరిగిందని, సాయంత్రం ఒకసారి ఇంటికొచ్చి మధ్యస్తం చేసి పొమ్మన్నాడు. 'అలాగే' అని సమాధాన మిచ్చాను.

ఆ పార్కుల్లో వీచే చల్లని గాలికి హాయిగా నిద్రపట్టింది. సాయంత్రం నాలుగు గంటలకు గాని మెలకువ రాలేదు. మధ్యాహ్నం భోజనం లేకపోవటంతో కడుపులో మంటగా వుంది. లేచి కొద్ది దూరంలో వున్న పంపు దగ్గర చల్లని నీళ్ళతో ముఖం కడుక్కున్నాను.

ఆ సమయంలో భోంచేయడానికి హోటళ్ళుండవు. నేను దిగిన గెస్ట్ హౌస్‌కు వెళ్ళాలంటే చాలా దూరం. అందుకే పార్కు నుంచి బయటపడి ప్రక్కనే ఉన్న హోటల్‌లో కాఫీ త్రాగి ఒక సందులోంచి వస్తున్నాను. ఆ సందులో ప్రతి ఇంటి ముందూ ఆడవాళ్ళు నిలబడి ఒకరితో ఒకరు పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. ఒక ఇంటి ముందుకు రాగానే రంభలాంటి స్త్రీ గబగబా నా దగ్గరకు వచ్చినా చేయి పట్టుకుంది.

"రండి లోపలకు వెళ్దాం" అంది.

అంతే అక్కడున్న ఆడవాళ్ళు నన్ను చుట్టుముట్టారు. నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. దాంతో పాటు అది నేనెరిగిన వేశ్యావాటిక అని కూడా అర్థమయింది. మొదట నా చేయిపట్టుకున్నామె పేరు జయంతి.

ఇలా వేశ్యలంతా నా మీద పడేసరికి వాళ్ళని తప్పించుకొని జయంతి వెంట ఇంట్లోకి నడిచాను. జయంతి చల్లని మజ్జిగ ఇచ్చి నన్ను మెత్తని పరుపుమీద పరుండబెట్టి కాళ్ళు ఒత్తసాగింది.

"జయంతీ! నాకు ఇలాంటివి ఆలవాటులేదు" అన్నాను శాంతంగా.

"నాకు మాత్రం అలవాటుందా కోటిలింగం సార్? మొగుడు వదిలి, ఈ సంఘంలో విష జంతువుల్లాంటి పురుషుల మధ్య బ్రతకలేకుంటే, మీరిచ్చిన సలహాయే గదా ఇది"

నా నోట్లో వచ్చి వెలక్కాయ పడినట్లయింది. నా అస్త్రం నా మీదే తిప్పికొట్టింది. ఇంకేం మాట్లాడగలను? కొద్దిసేపుండి మెల్లిగా ఆమెను వదిలించుకుని అక్కడ నుంచి

బయటపడి నాకు కేటాయించిన గెస్ట్‌హౌస్ వైపు నడుస్తున్నాను. ఇప్పుడు నా మెదడు తీవ్రంగా ఆలోచిస్తోంది. ఇదంతా ఏమిటి? ఏదో వుంది. అదేమిటి? నా మెదడు తర్జనభర్జనల మధ్య జ్ఞానదీపం వెలగబోతోంది.

ఈ లోపల గేటు ముందుకు వచ్చాను. గూర్ఖాతలుపు తీసి "రండి సార్" అంటూ నవ్వుముఖంతో ఆహ్వానించాడు. అతన్ని బాగా పరిశీలించి చూశాను. ఆ నవ్వు ముఖం వెనుక విషపు ఆలోచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాడి కళ్ళల్లో ప్రతీకారేచ్ఛ కనిపించింది.

దాని వెనుక కథ తెలుసు. అదేమిటంటే నా సెక్రటరీకి, వీడికి శారీరక సంబంధం ఉంది. వీళ్ళిద్దరూ వేసుకున్న ప్లాను ప్రకారం రాత్రి నా గదికి వచ్చిన సెక్రటరీ ప్రభావతి పాలల్లో విషం కలిపి ఇవ్వబోతోంది. ఫలితంగా నా చావు, వాళ్ళ ప్రేమ సఫలం.

అందుకే మళ్ళీ వస్తానని చెప్పి వెనక్కు తిరిగాను. ఇప్పుడు నాకంతా స్పష్టంగా అర్థంకాసాగింది. అదేమిటంటే ఇప్పుడు కనిపించిన వ్యక్తులందరూ నా నవలల్లోని పాత్రలు. నా నవలల్లోని పాత్రలంతా ఒక చోట చేరి నన్నీ నూతన నగరానికి ఆహ్వానించాయన్న మాట. అందుకే అందరూ నాకు తెలిసినట్లుగా వుంది.

నే రాసిన 'సెక్రటరీ ఇన్ సీక్రెట్ లవ్' లోని పాత్రలు సెక్రటరీ ప్రభావతి. గూర్ఖా జయసింగు. వీళ్ళు హీరోని పాయిజనిచ్చి చంపి అతని సంపదతో పారిపోతారు.

ఇకపోతే హోటలు ప్రొప్రయిటరు 'గ్రేట్ థెఫ్ట్ ఇన్ ఎ స్మాల్ హోటల్' నవలలోని ప్రొప్రయిటరు. రిక్షావాలా పోతురాజు 'బీదల బ్రతుకుల్లో బాధల సుడిగుండాలు' నవల్లోనిపాత్ర. పార్కులో బఠాణీల రంగడిది, 'సంఘంలో స్వయం ఉపాధన' లోని పాత్ర.

నేనిప్పుడు ఎలాగో గెస్ట్‌హౌస్ నుంచి చావు తప్పించుకుని బయటపడ్డాను. అయితే నగరం నుంచి బయటపడి నా నివాస స్థానం చేరుకోవాలి. ఎలా?

ఆలోచనల్లోంచి తలెత్తి చూసే సరికి ఎదురుగా ఐదుగురు రౌడీలు నిలబడి ఉన్నారు. వారిలో మధ్యనున్నవాడు ఎర్రని గుడ్డ తలకు చుట్టి ఉన్నాడు. శరీరం మీద చొక్కాలేదు. నల్ల డ్రాయరుతో ఉన్నాడు. వాడే నా క్రైం నవల 'పట్నంలో పత్తేదారు'లోని విలన్.... నేనేదో మాట్లాడేలోగా వాడి చేతిలోని కర్ర నా నెత్తిమీద 'ఠపీ' మని పడింది.

• • • • • • • • •

పెద్దగా అరుస్తూ కళ్ళు తెరిచాను. అంతా కల. ఒక సైకలాజికల్ ఇల్యూజన్. ఏదయితేనేం? నేను సృష్టించిన పాత్రల మానసిక వేదన, కష్టసుఖాలు అర్థమయ్యాయి. నవలల్లోని పాత్రల్ని కూడా హింసాయుతంగా సృష్టించకూడదని, వాళ్ళ జీవిత సమస్యల్ని సానుభూతితో పరిశీలించి చక్కటి పరిష్కార మార్గాన్ని చూపించాలని నాకిప్పుడు అర్థమయ్యింది ✹

**(ప్రియదత్త వీక్లీ, తేది 14-5-2003)**